# "ఫర్ గెట్ మి నాట్"

స్టేషన్ ట్రిప్ కావటంవల్లనో యేమో

నాలాంటి స్టాండింగ్ ప్యాసింజెర్సుతో బస్సు మరీ రద్దీగావుంది. డ్రైవర్ సడన్ బ్రేకు వెయ్యటంతో, నేను నా ముందున్న రెండు జడలమ్మాయిపైకి ఒరగటం, ఆ అమ్మాయి నా అవస్థ తెలుసుకోకుండా కళ్ళెర్ర చేయటంతో నాకు అరకాలిమంట నెత్తి కెక్కింది. "ఈ ఆడవాళ్ళందరూ ఇంతే..." కావాలని వాళ్లని అందరూ రాచుకుంటూ పోయే వాళ్ళే అని వాళ్ళ వుద్దేశ్యం.

అయినా పబ్లిక్ బస్సులో మడికట్టుకున్నట్లుగా కూర్చోవాలంటే యెలా సాగుతుంది? ఆమె అవస్థకి జాలేస్తూనే వుంది. సాధ్యమైనంతదూరంగా నిలుచోవాలని ప్రయత్నించినా వెనకనుంచున్న జనం నెట్టుకురావటంతో ఆమెకుదగ్గరగా జరగక తప్పటంలేదు. నా బూటుకాలు మీద ఆమెకాలు ఎంతసేపటినుంచో వున్నా, నేను ఎంతో వోపిగ్గా సహిస్తున్నా, ఆమె తన కాలును కాస్త అవతలికి తీసుకోటానికి విశ్వప్రయత్నం చేసి, సాధ్యంకాక నా వైపు కొరకొరా చూసి ఒకచేత్తో హాంగర్ ని గట్టిగపట్టుకుని రెండోచేత్తో జారిపోయే పమిటని అదిమి పట్టుకోటానికి వ్యర్థప్రయత్నంచేస్తోంది.

ఆ అమ్మాయి అవస్థచూస్తే మనసు వున్న ఏ మగాడైనా కాస్త "ఫీ" లవక తప్పదు. పాపం ఆమెకి ముందూ వెనుకా ప్రక్కనా అంతా మగవాళ్ళే. ఆమె అవస్థని సీటులో కూర్చున్న వాళ్లు యికిలిస్తూ చూస్తున్నారు. అసలే జనం క్రిక్కిరిసి వుండటంతో గాలి ఏమాత్రం లోపలికి రావటంలేదు.

"టికెట్ట్ ప్లీజ్" కండెక్టర్ జనం లోంచి దూరి చెయ్యి ముందుకి చాచాడు.

నేను పర్సు తీయటానికి ప్రయత్నిస్తుండగా, డ్రైవర్ సడెన్ బ్రేక్ వెయ్యటంతో నా మీద వచ్చిపడింది ఆ అమ్మాయి. "టికెట్" అంటూ ఆమె వైపు చెయ్యి చాచాడు కండెక్టర్.

*గోవిందరాజు సీతాలక్ష్మి*

ఆమె నా వైపు చూపించటంతో ఆశ్చర్యంగా నోరు తెరిచాను. "ఒక్క టిక్కెట్టే అంటారేం సార్ ..మీలాంటి చదువుకున్న వాళ్ళే ఇలా చేస్తే ఎలా?" కాస్త విసుగూ కాస్త కోపం ధ్వనిస్తూ రెండు టికెట్లూ చించి మిగతా చిల్లర నా చేతిలో పెట్టి ముందుకు వెళ్లాడు. నా ఇష్టా ఇష్టాలతో సంబంధంలేకుండా నే గళ్ళపర్టు కుర్రాడు కిస్సుక్కుమన్నాడు నా అవస్థ . ఒక్కక్షణం స్థంభించినా, మరుక్షణంలోనే పట్టలేనంత కోపం వచ్చింది. ఒక్కసారి ఆ అమ్మాయివైపు పరిశీలనగా చూశాను. గౌరవకుటుంబానికి చెందిన అమ్మాయిలానే కన్పిస్తోంది.

"ఏం ప్రపంచంరా బాబూ... ఇదే నేను ఆమెవైపు చూపించి "రెండు టికెట్లూ తీసుకో" అంటే సహిస్తుందా? అల్లరిచేసి విడుస్తుంది. క్షణం ఆలోచించి అసలు ఎవరు ఈ అమ్మాయి? ఏ ఉద్దేశ్యంతో తన టికెట్టు కూడా తీసుకోమందీ? బహుశా బజారురకం కావచ్చు. ఇలా ఆకర్షించేందుకు ప్రయత్నించే వాళ్ళు పట్నవాసంలో వుండొచ్చు... కాని ఏమంత బస్తీకాని ఈ ఊళ్ళో కూడా వుంటారా?

ఆలోచిస్తూ ఉండగానే దిగవలసిన స్టాప్ రావటంతో ఆలోచనలు కట్టిపెట్టి బస్సు దిగి లాడ్జింగ్ హోమ్‌లోకి దారితీశాను.

నా బిజినెస్ పనుల్లో ఈ వూరికి రావటం మామూలే. నౌకరుకుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి చేతిలోని సూట్‌కేస్ అందుకున్నాడు. ఎప్పుడు వచ్చినా వాడికి మంచి "ఈనామ్" ముడుతుంది. అందుకే నేనంటే వాడికి చాలా ఇష్టం.

స్నానం పూర్తిచేసుకుని, కాఫీ తాగి వూళ్ళో నేను కలుసుకోవలసిన వాళ్ళ అడ్రెస్‌లు చూసుకుని వెళ్ళి తిరిగి వచ్చేసరికి రాత్రి ఏడుగంటలయింది. "ఇంకా కొంత పని మిగిలిపోయింది. రేపు కూడా వుండక తప్పదల్లే వుంది" అనుకుంటూ పరధ్యానంగా తలుపు తెరిచాను. ఎదురుగా కన్పించిన దృశ్యానికి ఈ ప్రపంచంలోకి వచ్చాను.

జాకెట్టు విప్పి చేతులు రెండూ ఎత్తి అద్దంలో "బ్రేజియర్సు" లోని తన అందాన్ని పరీక్షగా చూసుకుంటున్న "స్త్రీ" మూర్తి.

"అరే . ఇది ..నా రూము కాదా? పొరపాటుకి చింతిస్తూ ఒక్క అడుగు వెనక్కివేసి "వెరీ...సారీ" అన్నాను.

"ఛీ.. ఇలా లోపలికిరావటానికి... బుద్ధిలేదూ ?" అంది నా వైపు మింగేసేట్లుగా చూస్తూ. ఖంగారుగా పమిట వంటినిండుగాకప్పుకోటానికి ప్రయత్నం చేస్తూ. ఆమె ఎంత ప్రయత్నించినా అతిపల్చటిచీరె కావటంవల్ల ఆమె ప్రయత్నం వ్యర్థమే అయింది. సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లోని చలువరాతి




శిల్పంలాంటి ఆ అందం నా హృదయాన్ని ఆవరించింది. కాని "బుద్ధి లేదా ?" అన్న మాటతో వళ్లు మండిపోయింది.

"ఎవరికీ బుద్ధి లేంది ... ఈ మాట నేను అడగాలి మిమ్మల్ని" అన్నాను. ఆ అందమైన కళ్ళు అగ్నిగోళాల్లాగా కోపంతో సెగలు గక్కుతున్నాయి.

"ఆ...నా గదిలోకి వచ్చి...నన్నే బుద్ధిలేదంటున్నావా ?" అంది రొప్పుతూ.

"అవును...అసలు తలుపు లోపల వేసుకోకుండా... మీరు...ఇలా ..."

ఆమె నా మాట విన్పించుకోకుండా "యూ...షటప్... గెటవ్ట్" అంది వెట్టింపు కంఠంతో.

అంతవరకూ ఆ అమ్మాయిమీద నా మనస్సులో యేమూలోవున్న కాస్త సదభిప్రాయం యెగిరిచక్కాపోయింది ఈ సంఘటనతో.

"హూ..." ఆగ్రహంతో నా రక్తం వుడికెత్తిపోయింది. అలా రంకెలు వేస్తూ "గెటవ్ట్" అంటూ అరుస్తున్న ఆమెని దగ్గరకివెళ్ళి నా బలమైన చేతులతో... ఒక్కసారి... అలా... ఛీ... ఏమిటి నా మనస్సు కూడా సంకీర్ణభావాలకి గురైంది. యేనాడూ చెదరని నా మనస్సు ఈ

రోజు ఇలా... నా స్వాదీనం తప్పు తున్న దేమిటి? ఛీ... ఆ అమ్మాయి తొందరపడి నన్ను కించపరిచిందని... నేనూ వివేకం పోగొట్టుకుంటూనా? అసలు సిటీబస్సు దిగింతర్వాత ఈ అమ్మాయి మాటే మరిచిపోయాను. ఆమె ఈ "లాడ్జింగ్ లోనే, నా రూము ప్రక్క రూములోనే వున్నట్లుగాకూడా తెలియదు.

"మర్యాదగా మాట్లాడటం.... చాలాఅవుసరం, గుడ్ నైట్" అంటూ వత్తిపలికి నా రూములోకి వచ్చేశాను.

నా జవాబుకి ఆమెముఖం పాలిపోయింది. అసలు తప్పెవరిది? ఇలాంటి "స్త్రీ"లు ఏ రకానికి చెందుతారు? ఇది నా వూహాకి అందని విషయం. అసలు ఇలా వంటరిగా తిరగటం యెందుకో? అమె పరిస్థితి యేమిటో? బహుశా యెవరైనా నమ్మించి తీసుకువచ్చి మోసంచేసిన బాపతా? కాదు... ఆ అమ్మాయి ముఖంచూస్తే అలా అన్పించటంలేదు.


అయినా ప్రయాణాల్లో సహజంగా ఇలాంటివాళ్ళు తరుచుగా కన్పిస్తూనే వుంటారు. వీళ్ళని గురించి ఆలోచిస్తూ కూర్చుంటే అయినట్లే అనుకుని ట్రావెలింగ్ బాక్సు తెరిచి రికార్డ్సు చూచుకోవటంలో మునిగిపోయాను.

"పదకొండుగంట లయినా యిలా లైటు వెలుగుతుంటే ప్రక్కరూములో యెలా నిద్రపోయేది. కాస్తకూడా మేనర్సు తెలియదులా వుంది మీకు" యెదురుగా అపర కాళిగా గర్జిస్తూ నిలబడింది ఆ అమ్మాయి.

ఒక్కక్షణం చేతి వాచీ వైపు చూశాను. పదకొండుకి అయిదు నిమిషాలు తక్కువ. నా గదిలో "లైటు" ఈమెని యెలాబాధించింది? తలయెత్తి చూశాను. ఆ రూముకీ నా రూముకీ మధ్యనవున్న గోడ పూర్తిగా లేదు. గ్లాస్ షీటింగ్ రూఫింగ్ చేర్చటం మూలాన ఈ గదిలోని వెలుగు ఆ గదిలోకి పడటానికి అవకాశం వుంది. అందుకే ఈ ప్రళయం "యక్సూస్యూజ్... మీ.. వన్ మినిట్" అంటూ కాగితాలన్నీ సర్దేసి లైటుతీసి బెడ్ మీద వాలాను.

కాని యెందుకో నిద్ర వచ్చేటట్లుగా లేదు. డిశంబరు కావటంవల్ల చలి విపరీతంగా వుంది. కిటికీ తెరిచి నిలుచున్నాను. చలిగాలి "రై"యిన్న వీస్తోంది. దూరంగా మినుకు, మినుకు, మనే నక్షత్రాలు, యెక్కడికో రైలు వెడుతున్న శబ్దం. ప్రజలంతా నిద్రాదేవివడిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. మనిషి వంటరితనంలోనే యేవేవో భావాలతో సతమతమౌతూ వుంటాడు. తీయటి తలపులకూ, విషాద గాధలకూ మనసు క్రీడాస్థల మవుతుంది.

యెంత ప్రయత్నించినా నిద్ర రావ




టం లేదు. వచ్చీరాని నిద్ర దోబూచులాటగా వుంది. నిద్ర కలను చేరదీస్తే మెళుకువ బలవంతాన యదార్థంలోకి దింపుతోంది. కలా నిజాల సమ్మిశ్రమం అపూర్వం. మానవు డప్పుడే యెక్కడికెక్కడికో తేలిపోతూ వుంటాడు.

సన్నగా, మెల్లగా మాటలు విన్పించటంలో మెళుకువ వచ్చేసింది. అవి ప్రక్కగదిలోంచే... ఎవరో పురుషుడి కంఠస్వరంలాగా వుంది. అయినా ఇలాంటి హోటళ్ళలో యేంజరిగినా జరగవచ్చు. ఇది సహజమే. ఎంతకాదనుకున్నా ఆలోచనలు ఆ అమ్మాయివైపె పరిభ్రమిస్తున్నాయి. అంతమంది జనంలో ముక్కూ ముఖం యెరక్కపోయినా టికెట్టు కొనిపించి, ప్రక్క రూములోనే వుండి ప్రతిదానికీ తగూకి సిద్ధమవుతూన్న ఈమె ప్రకృతి యెంత ఆలోచించినా అర్థంకావటం లేదు.

ఇంతలో సన్నగా... అలా ..అలా అలలపై తేలివస్తున్న మృదుమధుర గానం నన్ను మైమరపింప జేసింది. ఎక్కడనించబ్బా ఈ గానం? ఎవరు యింత బాగా పాడేవాళ్లు? నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. రగ్గు కప్పుకునే తలుపు తెరిచాను. పాట ప్రక్కగదిలోంచిలాగా విన్పింస్తోంది. ఈ "చండిక" యింత బాగా పాడటంకూడా వచ్చా ఏమో ఎలా తెలుస్తుంది. పోనీ సౌమ్యంగానైనా మాట్లాడితే యేదైనా అడగవచ్చు. మాట్లాడటమే కరుస్తున్నట్లుంటుందయ్యే.

పాట క్రమేపీ తగ్గసాగింది. "ఇంత అర్థరాత్రి పాటలు పాడుతూ అందరి

నిద్రనూ చెడగొట్టటానికి యెవరిచ్చారు నీకీ అధికారం? మీకు మేనర్సు వుందా?" అని అడగాలని ఆమె గది తలుపు తట్టాలని తలుపుమీద చెయ్యి వేయ్యగానే తలుపు తెరుచుకుంది.


"అరే... తలుపు వేసుకోవటం ఈమెకి అలవాటు లేదల్లే వుంది... అయినా ఈ అర్థరాత్రి...వంటరిగా... ఈ లాడ్జింగ్ హోమ్‌లో?" ఆశ్చర్యం గానే ముందుకి ఒక్క అడుగు వేశాను. జీరోబల్బు కాంతి పల్చగా గదిఅంతా పరుచుకుంది. యెదురుగా చలికి ముడుచుకుని పడుకున్న ఆమె పెదవులు యింకా అస్పష్టంగా కదులుతున్నాయి. యెంత సుందరదృశ్యం... నేనే చిత్రకారుడినైతే అలాగే ఆమెను చిత్రించేసేవాడిని. ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో నెమ్మదిగా స్పందించే వక్షోభాగం పాలభాగంమీద చిందరవందరగా పడి వున్న ముంగురులు "ఫాన్" గాలికి మెల్ల మెల్లగా కదులుతున్నాయి. అంత చలిలోనూ ఆమె ముఖంమీద ఎందుకో సన్నగా ముత్యాలలాగా పోసిన చిరుచెమట? సీరియస్‌గా ఆలోచించి ఆలోచించి అలిసినట్లుందా ఆకృతి చూడగానే పసిపాపలాగ ముడుచుకొని పడుకున్న ఆమెను చూడగానే యెందుకో నా హృదయం ద్రవించింది.

ఆ గదిలోకి వచ్చేప్పుడున్న ఆవేశం ఆవిరిలాగా యెగిరి చక్కాపోయింది. చలికి కప్పుకోవాలనైనా తెలియదూ? వయస్సు ఇరవై సంవత్సరాలు వుండవచ్చు. అయినా యింకా పసితనపు ఛాయలుమాత్రం పోలేదు. నా రగ్గు తీసి ఆమెకు కప్పి మెళుకువ వచ్చిందా? అనిచూస్తే ఇంకా అలాగే నిద్రపోతుంది. "పిచ్చిపిల్ల" అనుకుని తలుపు దగ్గరగావేసి నా గదిలోకివచ్చి పడుకున్నాను.

... ... ...

రాత్రి సరిగా నిద్రలేకపోవటంతో, లేచేసరికేకాస్త ఆలశ్యమైంది వుదయం. ప్రక్క గదిలో "యే సందడీ వినిపించటంలేదు అయినా యింత త్వరగా ఆ "చండిక" లేస్తుందా? అనుకుంటూ నారాయణరావుగార్ని కలుసుకోటానికి గబగబా స్నానం పూర్తిచేసుకుని క్రిందకి దిగివచ్చాను. కాని యెదురుగా కన్పించిన దృశ్యం నన్ను నిర్ఘాంతపరచింది.

ఆమె మరొక యువకుడితో కలిసి మేనేజర్‌కి బిల్లు చెల్లించి గేటుదగ్గర వున్న జట్కా దగ్గరకి వెళ్ళిపోతోంది. అరే... నన్ను చూసికూడా చూడనట్లు... అసలు యెరగనట్లుగా...ఎలా వెళ్ళిపోతోంది... కావాలని కాస్త దగ్గుకూడా తెప్పించుకున్నాను. ఆమె ప్రక్కన నడుస్తున్న యువకుడు వెనక్కి తిరిగి చూశాడు గాని ఆమె మాత్రం తిరిగి చూడలేదు.




"హూ... కృతఘ్నురాలు... రాత్రి రగ్గు కప్పిన విషయం కనీసం తెల్లవారైనా గుర్తించలేదా?

"రాత్రి సమయంలో వంటరిగా వున్న నా దగ్గరకి యెందుకు వచ్చావ్' అని విరుచుకు పడుతుందో? లేక చలి బాధని నివారించినందుకు కృతజ్ఞతే తెలుపుతుందో?" అనుకుంటూ అప్పుడు నేను గంభీరంగా నవ్వి రాత్రి దృశ్యం వర్ణిస్తున్నప్పుడు ఆమె ముఖంలో మారే రంగులు చూసి సంతృప్తిపడాలని ఆశిస్తే చివరికి జరిగింది మరోలాగా.

పోనీ వెళ్లేప్పుడు....ఒక్కసారి..ఒకే ఒక్కసారి..."వెడుతున్నాను"అని ఒక్క మాట చెప్పివుంటే అంతబాధ కలగక పోను.

యెదురుగా ఆ జంట యెక్కిన గుర్రపుబండి టకటకా శబ్దం చేసుకుంటూ వెళ్ళిపోయింది. అతన్ని యింకా యింకా దగ్గరగా అతుక్కు కూర్చుని నావైపు అపరిచితులని చూచినట్లు చూస్తూ వెళ్ళిపోయింది. నా హృదయం ఒక్కసారి బాధగామూలిగింది. యెవరో ఆత్మీయులు దూరమయినట్లు "ఫీ" లౌతూ "ఇంక ఈరోజు నేనేంచేయలేను. పని పూర్తి కావటానికి యింకొకరోజు పట్టనీ" అనుకుంటూ రూములోకివచ్చి "బెడ్" మీద వాలిపోయాను.

"ఏం.... బాబూ... కాఫీ... కావాలా? బైటకి వెళ్ళకుండా వెనక్కి వచ్చేశారేం" అంటూ ప్రశ్నించాడు హోటల్ కుర్రాడు.

"తల నొప్పిగా వుంది... ఒకకప్పు స్పెషల్ కాఫీ తీసుకురా... అరేయ్ ఇలారా... రాత్రి యిక్కడ పాట పాడింది యెవరు?" అన్నాను కుతూహలంగా.

"ఓ... అదా బాబూ... కిష్టిగాడి అమ్మ లేదూ సార్ అది మన హోటల్లో పప్పు రుబ్బుతుందే అది... పాడింది. నేనే పాడిస్తా అప్పుడప్పుడూ. చాలా బాగా పాడుతుందండీ. తీసుకురమ్మ న్నారా?" అంటూ వెళ్ళబోయాడు.

"వద్దు.... వద్దు" అన్నా నేకాని నా ఆశ్చర్యానికి అంతులేదు.

"అరే... ఆ అమ్మాయి కాదూ పాడింది? చాలా విచిత్రం. కిష్టూగాడి అమ్మ ఇంత మధురంగా పాడుతుందా? నేను ఆ లో చి స్తూ వుండగానే "బాబూ ఈ వుత్తరం మీ కిమ్మని ఆ పక్క రూములో దిగిందే ఆ అమ్మాయి గారు యిచ్చారండీ...మరిచేపోయాను. ఆ అమ్మాయిగారు ఇప్పుడే గది కాళీ చేసి వెళ్ళారు. బలే మంచి అమ్మాయి. సినీమాకెళ్లు అని రూపాయిచ్చింది బాబూ. "కాఫీ" క్షణంలో తెస్తా" అంటూ కవరు చేతిలోపెట్టి లోపలకి పరుగెత్తాడు.

నాకా? ఆ చండిక వుత్తరం రాసి... ఇవ్వమని వెళ్ళిందా? ఆశ్చర్యంనుంచి తేరుకుంటూ కవరు తెరిచాను.

"నమస్తే...

మిమ్మల్ని ఏమని సంబోధించాలో తెలియటంలేదు. మీ గురించి ఎక్కువ తెలియకపోయినా సహృదయులని గుర్తించాను. ఇక నా గురించి చెప్పా లంటే...మిగతా విషయాలు ఎలా వున్నా అసలు నేను యిలా వంటరిగా ఎందుకు ప్రయాణించానో చెప్తాను.

నేనూ, ఆనంద్ B. Sc. ఫష్టియర్ నుంచీ స్నేహితులం. బాగా అర్థంచేసు కున్నాం. ఒకరిని ఒకరం ప్రేమించు కున్నాం. కాని వివాహం చేసుకోవా లనుకునేప్పటికే వచ్చింది చిక్కంతా! ఏముందీ? మామూలే! అతని తలి దండ్రులూ, నా తల్లిదండ్రులూ ఆమో దించలేదు. కులమూ, అంతస్తులూ, అడ్డువచ్చాయి. మేము మాత్రం చిలుకా గోరువంకల్లాగా స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికి నిశ్చయించుకున్నాం. కాని నిర్ణీతసమయానికి "ట్రైను" దగ్గర ఆనంద్ నన్ను కలుసుకోలేకపోయాడు. ఎంత చదువుకున్నా స్త్రీ వంటరిగా, ఈ ప్రపంచంలో మనగలగటం కష్ట సాధ్యమని రెండురోజుల్లోనే గుర్తిం చాను.

ట్రైన్లోనే నా సూట్కేసు దొంగి లించబడింది. పర్సు మాత్రం జాకెట్టులో వుండటంవల్ల భద్రంగానే వుంది... "దగ్గర డబ్బువుండీ నా చేత బస్ టికెట్ ఎందుకు కొనిపించిందీ?" అని మీరు ఆశ్చర్యపోతున్నారు గదూ? అసలు సంగతి ఏమిటంటే నేను వంటరిగా వున్నానని "రౌడీ"లు పసికట్టి నావెంట పడ్డారు. వాళ్ళకి మస్కా ఇచ్చేందుకే అలా ప్రవర్తించాను. మీ అప్పటి గాభరా చూస్తే, నాకు బోలెడంత

జాలేసింది. కాని యేంచేయను? మీ మంచితనం కళ్ళల్లో కన్పిస్తున్నా నాకే,..యేదో ... భయం. "టికెట్టు కొన్నాను గదా?" అనే చులకనతో యేమైనా...ఇలా యేదో భయంతోనే మీతో సరిగా మాట్లాడలేక లేని ఆగ్రహాన్ని, రాక్షసత్వాన్ని ప్రదర్శించి నన్ను నేను కాపాడుకోవా లనుకున్నాను.

కాని...నా ఆలోచనలన్నీ ఆధార రహితమేనని రాత్రి మీరు...నా గది లోకి వచ్చి చలిలో, ముడుచుకు పడుకున్న నాకు మీ "రగ్గు" కప్పి ఆ చలి బాధను మీరు అనుభవించారంటే మీది సంస్కారయుతమైన హృదయం కాదనటానికి ఎవరికి ధైర్యం వుంది?

నేను మొదట కావాలనే తలుపు తెరిచి పడుకున్నాను. కాని మీరు తిరిగి వెళ్ళింతర్వాత తలుపు గట్టిగా బిగించి పడుకున్నానని మీకు తెలియదుకదూ? మీతో కాస్త చనువుగా మాట్లాడాలనీ, కృతజ్ఞత తెలియజెయ్యాలనీ యెంతో అనుకున్నాను. కాని అలా దగ్గరగా వస్తే వివరాలన్నీ అడిగి తెలుసుకుని చులకనగా చూస్తారేమో అని భయపడ్డాను.

ఆనంద్ ఆ "ట్రైన్"కి రాలేదు. "నమ్మించి మోసంచేశాడు" అని ఎంతో కుళ్ళి కుళ్ళి ఏడిచాను. కాని అదంతా నా పొరపాటే. తర్వాత ట్రైన్ కి వచ్చి ఎంతో కష్టపడి నన్ను ఈ హోటల్లో కలుసుకున్నాడు. ఇక మా అదృష్టం పండినట్లే. నా జీవితబాట కొక సహబాటసారి...కాదు...కాదు ..ప్రేమించిన భర్త లభించినందుకు నా సంతోషం వర్ణనాతీతం.

మీకు ఈ విషయాలన్నీ స్వయంగా తెలియజేయా లనుకున్నాను... బహుశా ఎదురుగా అయితే ఇలా... నా మనస్సు విప్పి చెప్పలేనేమో? మే మిద్దరం దూరంగా వెళ్ళిపోతున్నాం. తల్లిదండ్రులనీ, ఆత్మీయులనీ, వదిలి ఒకే ఒక వ్యక్తికోసం నా సర్వస్వాన్ని అర్పణ చేసుకుంటున్నాను. భవిష్యత్తు ఎలా వుంటుందో? మీ జ్ఞాపకచిహ్నంగా మీ రగ్గు కూడా నాతో తీసుకువెడుతున్నాను. మీరు అలా చలి అనుభవించాలిసిందే. మీకు ఈ భావంలో కూడా ఒకవిధమైన తృప్తి ఉంటుందని నాకు బాగా తెలుసు.

ఆఖరుసారిగా మీకు నా హృదయపూర్వక నమస్కారాలు.

రౌడీల బారినుంచి రక్షించినందుకు "థ్యాంక్స్". రగ్గు ప్రజంట్ చేసినందుకు డబుల్ థ్యాంక్స్.

ఈ కాలంలో కూడా మీలాంటి సహృదయులున్నారంటే అది నిజంగా వండర్!

ఫర్ గెట్ మి నాట్.

సుచిత్ర."